క్లుప్తంగా

మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: స్థానిక మార్కండేయపురంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మినరల్ వాటర్‌తో భావనాబుషి భద్రావతి సమేత మార్కండేయస్వామి వారికి ఎమ్మెల్యే దంపతులు అభిషేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే లక్ష్యంతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాతల ఔదార్యాన్ని కొనియాడిన ఎమ్మెల్యే దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురపూడి: వార్షిక మరమ్మతుల కారణంగా కోరుకొండ మండలంలోని గాడాల, బూరుగుపూడి సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. గాడాల, నిడిగట్ల, పాలచర్ల, మధురపూడి, బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చెంపేట, దోసకాయలపల్లి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

సీతానగరం: మిర్తిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉండేశ్వరపురం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కావున మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఘనంగా లక్ష రుద్రాక్షాభిషేక పూజలు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడితల మామిడి వద్ద ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద త్రయాహ్నిక లక్ష రుద్రాక్షాభిషేక పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో మల్లిడి శ్రీనివాసరెడ్డి, రేణుకాపద్మ దంపతులు కర్తగా వ్యవహరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి, మల్లిడి కోదండం బ్రదర్స్, చిన్నం శ్రీనివాసరెడ్డి, మల్లిడి సురేష్ కుమార్‌రెడ్డి, మల్లిడి మోహర్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



శ్రీరంగపట్నంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి, నరేష్

మధురపూడి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు కోరుకొండ తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. శ్రీరంగపట్నం హై స్కూల్లోని 8 పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, వెలుతురు, ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుకూలమైన స్థలం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నమన్నారు. గత రెండు రోజులుగా కాపవరం, కోరుకొండల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు ఆయన తెలిపారు. కేంద్రాలన్నీ బాగున్నాయన్నారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీ నరేష్, శ్రీరంగపట్నం హైస్కూల్ హెచ్‌ఎం ఎన్.వెంకటేశ్వరరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

- సకాలంలో మందుల పిచికారీతో ప్రయోజనం
- జీడి, మామిడి తోటల రైతులకు అధికారుల సూచనలు



బూరుగుపూడిలో మామిడితోటలు

మధురపూడి: సన్న, చిన్నకారు రైతులకు ఆదాయ వనరైన మామిడి, జీడితోటల్లో పూత దశను కాపాడుకోవడం చాలా అవసరం. తేనె మంచు కారణంగా మామిడికి పలు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. తేయాకు దోమ కారణంగా జీడి పంట దిగుబడి తగ్గిపోతుంది. వీటి నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలి. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో మామిడి, జీడి తోటలపై రైతులు ఎక్కువ ఆధారపడతారు. దిగుబడి బాగుండాలంటే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారులు జాగ్రత్తలు చెబుతూ పలు సూచనలు ఇస్తున్నారు.

వేపనూనె పిచికారీ

జీడి పంటకు తేయాకు దోమ, మామిడికి తేనె మంచు కారణంగా సోకే తెగుళ్ల నివారణకు వేపనూనెతో సస్యరక్షణ సాగు విధానాన్ని అవలంబించాలి. తద్వారా పంటను కాపాడుకుని, దిగుబడి పెంచుకోవచ్చు. మామిడిలో కొత్తగా పూత దశలో మొదటి దఫా పిచికారీలో సల్ఫర్ 3 గ్రాములు, రోగార్ 2 ఎంఎల్, పొటాషియం నైట్రేట్ 1 గ్రాము, 1 టీలర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అప్పుడే పూత బాగా వస్తోంది. పూత దశలో వచ్చే పురుగులను నివారించవచ్చు. మామిడిలో పిండి పురుగుల నివారణ చాలా ప్రధానం. మొగ్గ దశలో తేనె మంచు పురుగు, పక్షి కన్ను తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు చర్యలు చేపట్టాలి. మామిడి, జీడి మామిడి తోటలు రాజానగరం నియోజకవర్గంలో 7,040 హెక్టార్లు, అనపర్తి నియోజకవర్గంలో 2,589 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి.

వీడింగ్, తొలకరి దుక్కుతో మేలు

మామిడి, జీడి తోటల్లో యాజమాన్య పద్ధతులను అనుసరించడం లాభదాయకం. దానిలో భాగంగా చెట్ల కింద వీడింగ్, దుక్కి దున్నించడం వల్ల చెట్లకు బలం ఉంటుంది. వర్షం నీరు చెట్టుకు చేరడానికి చుట్టూ పళ్లాలు తవ్వాలి. చెట్టుపై ఎండిపోయిన కొమ్మలను తొలగించి, గొడుగు ఆకారంలో తయారు చేయాలి. దాని ద్వారా సూర్యకిరణాలు చెట్టుకు చేరతాయి. చీడ పీడల నివారణ చేపట్టాలి. దీంతో దిగుబడి పెరుగుతుంది.

తేయాకు దోమతో జీడికి నష్టం

తేయాకు దోమ కారణంగా జీడిమామిడి పంట దిగుబడి తగ్గుతోంది. వేపనూనె పిచికారీ చేయడం ఎంతో ప్రయోజనం. తేయాకు దోమ, కాండం తొలుచు పురుగులతో కూడా పంటనష్టం ఏర్పడుతోంది. చిగురుదశలో మోనోక్రోటోఫస్ 1.6 ఎంఎల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండో దఫాగా పూతదశలో క్లోరోఫైరీఫోజ్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 3వ దఫాలో పిందె దశలో ప్రొఫెనోఫోజ్–1 మిల్లీ లీటర్ మందును ఒక లీటర్ నీటిలో కలిపి చల్లాలి. కాండం తొలిచే పురుగును ఊసద్వారా బయటకు తీసి, కాల్చేయాలి. ఆ కాండంలో వేపనూనె స్ప్రే చేయాలి. బోర్డ్ ఆఫ్ పేస్ట్ మిశ్రమంతో రంధ్రాన్ని పూడ్చాలి.

మందుల పిచికారీ



జీడి, మామిడి తోటల్లో అధిక దిగుబడులు రావాలంటే డిసెంబర్ నుంచి మార్చి వరకూ అవసరాన్ని బట్టి మందులను పిచికారీ చేయాలి. తేయాకు దోమ నివారణకు మూడు దఫాలుగా మందులు పిచికారీ చేయాలి. మామిడిలో పిండి పురుగుల నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్, లేదా 2 మిల్లీలీటర్ల క్వినాల్ఫాస్ లీటరు నీటికి కలిపి, చెట్టు భాగాలు తడిచేలా స్ప్రే చేయాలి. పూత దశలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి, అలాగే బోరాన్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగులు ఉధృతంగా ఉన్నప్పుడు క్లోరిపైరిపాస్ 20 ఈసీ, 3 ఎంఎల్ డైక్లోరోవాస్ 0.5 ఎంఎల్, మాంకోజెబ్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– రినీ, ఉద్యానశాఖ అధికారి, కోరుకొండ

యాజమాన్య పద్ధతులే రక్ష



మామిడి, జీడి మామిడి పంటల సంరక్షణకు యాజమాన్య పద్ధతులను అనుసరించాలి. శీతాకాలంలోనే చెట్ల సంరక్షణ చర్యలు పూర్తి చేయాలి. తెగుళ్ల సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలి. జిల్లాలో జీడి, మామిడి రైతులు అధిక సంఖ్యలో ఉన్నారు. గత సంవత్సరం మామిడిలో కాయపుచ్చు తెగులు కారణంగా రైతులు నష్టపోయారు. దీని నివారణకు డైక్లోరోవాస్(నువాన్) 1.6 ఎంఎల్ మందును లీటరు నీటిలో పిచికారి చేయాలి.

– కోటా సుబ్రహ్మణ్యం, రైతు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గ్రాసిం ఇండస్ట్రీ నిర్మించిన కళావేదికల ప్రారంభం



రంగాపురంలో వాటర్ ట్యాంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



జి.మామిడాడ శివారు పాటి మీద కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

బిక్కవోలు: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం రంగాపురం, ఇలపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా నియమితులైన గూడూరి శ్రీనివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగాపురంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.41 లక్షలతో నిర్మించిన తాగునీటి పైపులైన్, గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో ఎస్సీ ఏరియా, బీసీ ఏరియాల్లో నిర్మించిన కళావేదికలను ప్రారంభించారు. ఇలపల్లిలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, గ్రాసిం ఇండస్ట్రీ సహకారంతో నిర్మించిన బీసీ కళావేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్‌లు గండికోట వీరభద్రరావు, లొల్లం భద్రం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సాధనాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట దేవుడు జగన్

పెదపూడి: రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట దేవుడని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం జి.మామిడాడలోని పల్లీపేట, గ్రామ శివారు పాటి మీద గ్రాసిం ఇండస్ట్రీ వారి సౌజన్యంతో నిర్మించిన కళావేదికలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా నియమితులైన గూడూరి శ్రీనివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో గ్రాసిం ఇండస్ట్రీ వారు కళావేదికలు నిర్మించడం చాలా అభినందనీయమన్నారు. గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్న తనను, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాసులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, చింతా దొరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సత్తి భగవాన్ రెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

అనపర్తి: రహదారి భద్రత జీవితానికి భద్రత అని, వాహనదారులు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రాజమహేంద్రవరం ఎంవీఐ సీహెచ్ సంపత్ కుమార్ అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సంపత్‌కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని కారణంగా ఇటీవల కాలంలో ద్విచక్రవాహనదారులు అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించడం వల్ల చేకూరే ప్రయోజనాలను ఆయన వివరించారు. అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.రాధిక దేవి, ఎస్.సబిత, డాక్టర్ పి.మాధవి జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పీ అబ్బాయిరెడ్డి, జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరిప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చైతన్య

సీతానగరం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్వహించారు. బుధవారం చినకొండేపూడి విజయదుర్గ పబ్లిక్ స్కూల్లో పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నిండిన పిల్లల నుంచి 19 ఏళ్లు నిండున వారందరూ ఆల్బెండాజోల్ మాత్రను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈమాత్రలు కడుపులో నులి, కొంకి, బద్దె పురుగులను నిర్మూలిస్తాయని తెలిపారు. ఇవి ఆరు నెలలకు ఒకసారి వేసుకోవడంతో రక్తహీనత నుంచి పిల్లలను కాపాడవచ్చన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలో విద్యార్థులతో మింగించాలని సూచించారు. మండలంలో ఏడాది నిండి, 19 ఏళ్లు నిండిన 12,244 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సూపర్వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, హెల్త్ అసిస్టెంట్ బి.శ్రీను, ఎంఎల్‌హెచ్‌పీ ఎం ఆరుణ, ఏఎన్ఎంలు ఎం.విశాలాక్షి, కె.కృష్ణవేణి, ఆశా వర్కర్లు ఎ.సంధ్య, సీహెచ్ రామసీత, కె.రాణి, పీహెచ్ ఆకాలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు
- కోరుకొండ మండలంలో శివారు ప్రాంతాల పరిశీలన



కోటి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్సై ఆనందబాబు

మధురపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక, సరిహద్దుల్లోని గ్రామాల్లో పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్టు నార్త్‌జోన్ డీఎస్పీ కండే శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కోరుకొండ మండలంలోని కోటి, గరగలంపాలెం, బొల్లెద్దుపాలెం, కణుపూరు, రాజవరం, రాఘవపురం గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని పరిస్థితులపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టేందుకు ఈ గ్రామాలను పరిశీలంచామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను, గ్రామ సరిహద్దులను తనిఖీ చేసినట్టు చెప్పారు. కోరుకొండ, సీతానగరం మండలాలు ఏజెన్సీ సరిహద్దున ఉండడంతో మందుగా వచ్చే సమస్యలను గుర్తించినట్టయితే వెంటనే నివారణ చర్యలు చేపట్టవచ్చని, దానికోసం చర్యలు చేపట్టామన్నారు. అయితే ఇక్కడ ఎన్నికలకు ఆటంకం కల్పించే అవకాశాలేవీ లేవని తెలిపారు. ఆయన వెంట కోరుకొండ ఎస్సై డి. ఆనందకుమార్, పోలీసులు, పోలింగ్ కేంద్రాల సిబ్బంది, గ్రామాల మహిళా పోలీసులు ఉన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధిని సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్లంపూడి, బీసీ గురుకులం పాఠశాలలో 61 మంది 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో మహానేత వైఎస్సార్ రాష్ట్రంలో ఫీజురీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి ఆ పథకంతోపాటు ప్రభుత్వ పాఠశాలలను కూడా ఆధునీకరించి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేలా సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, గోరుముద్ద వంటి పథకాలతో వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవితను అందుకోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు ఆర్ట్స్ కళాశాలలో చేయూత

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఆపన్నులకు చేయూత కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమీ జీవకారుణ్య సంఘం, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో వారికి దుస్తులు, దుప్పట్లు, బియ్యం వంటి నిత్యావసరాలు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు ఆపన్నులకు సహాయపడడమే కాకుండా ఇచ్చిన దాతలకు ఎంతో మానసిక తృప్తి ఇస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, డాక్టర్ ఈఎస్ఆర్ఎస్.శర్మ, బి.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలి

కడియం: వ్యవసాయంపై ఆధారపడిన మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని గ్రామీణ ఫౌండేషన్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గజేంద్రరాయ్, డాక్టర్ బీనాలు సూచించారు. జనరేటింగ్ రూరల్ ఆపర్చునిటీస్ ఫర్ ఉమెన్ టు విన్ ఇన్ అగ్రిఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(గ్రో) ప్రోగ్రాంలో భాగంగా సంస్థ ప్రతినిధులు బుధవారం కడియం మండలం దుళ్ల గ్రామంలోని చిట్టూరి చౌదరి వ్యవసాయ క్షేత్రంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా సాగయ్యే పంటలు, మార్కెటింగ్ ఇబ్బందులు, వాటిని అధిగమించేదుకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా గజేంద్రరాయ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా తూర్పు, పశ్చిమ, కృష్ణా, విశాఖ జిల్లాల పరిధిలో రానున్న అయిదేళ్లలో పదివేల మంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు టీఎస్ చంద్రశేఖరరావు, ఆర్.శ్రీనివాసరావు, పి. ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థినులకు మలబార్ గోల్డ్ సంస్థ ప్రతిభా పురస్కారాలు, స్కాలర్‌షిప్‌లు అందజేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ చేతుల మీదుగా ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపుతున్న విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారన్నారు. బహుమతులు పొందిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, హేమ, మాధురి, కృష్ణమూర్తిలు అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బిక్కవోలులో పీడీఎస్ బియ్యం పట్టుకున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో 600 కేజీల పీడీఎస్ పట్టుకున్నట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారుల సమాచారం మేరకు వాహనాలు తనిఖీలు నిర్వహించి బిక్కవోలు గ్రామానికి చెందిన చలపతి ప్రసాద్ అనే వ్యక్తి 12 బస్తాలతో 600 కేజీల పీడీఎస్ బియ్యాన్ని ఆటోపై తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి బియ్యాన్ని, ఆటోను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బియ్యం విలువ సుమారు రూ.27,300 ఉంటుందన్నారు. వారిపై 6 ఏ కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, బిక్కవోలు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ శివ, వీఆర్వో కొటాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీచౌక్ వార్షికోత్సవం



దేవీచౌక్ వార్షికోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: చక్రద్వారబంధం దేవీచౌక్‌లో కొలువై ఉన్న జగన్మాత ఆలయ 17వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. జరిగాయి. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గ్రామానికి చెందిన నాగవరపు త్రిమూర్తులు, తులసి దంపతుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, చండీయాగం, దేవి అష్టోత్తర పూజలు జరిగాయి. కార్యక్రమంలో నీలపాల శివరామకృష్ణ, నాగవరపు వెంకటరమణ, భానుశంకర్, పిల్లా శ్రీను, నల్లమిల్లి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకరెడ్డికి సన్మానం



కార్తీక్ రెడ్డిని సన్మానించిన యూనియన్ సభ్యులు

సీతానగరం: రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి.కార్తీకరెడ్డిని జిల్లా కో ఆపరేటివ్ సీఈఓ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కార్తీకరెడ్డి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం)గా పదోన్నతిపై కాకినాడ డీసీసీబీకి బదిలీ అయ్యారు. జిల్లా కోఆపరేటివ్ సీఈఓ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కాట్నం వెంకటేశ్వరరావు, సీఈఓలు ములగాల రామకృష్ణ, పెన్మత్స సుబ్బరాజు తదితరులు కార్తిక్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనపర్తి డీసీసీబీ మేనేజర్ ఎం.క్రాంతి కృష్ణ బదిలీపై రఘుదేవపురం డీసీసీబీకి బదిలీపై వచ్చి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సీఈఓలు లక్ష్మణరావు, పంతం సూర్యనారాయణ, ఎం.రాంబాబు, కాట్నగణేష్, ఎం.నాగేశ్వరరావు, ఎ.వెంకటరత్నం, వి.సురేంద్ర, జీవీ గుప్త, డీసీసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యారాధనకు ఏర్పాట్లు

సీటీఆర్ఐ: మాఘమాస సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుంచి నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించనున్న షోడశ దిన ప్రయుక్త పంచాయతన పూర్వక సూర్యారాధనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక పేపర్ మిల్ రోడ్డు సీతంపేటలోని యాగ స్థలంలో నిర్వాహకులు వడలి కుమార్ శర్మ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 వరకూ ప్రతీ రోజు సూర్యనమస్కారాలు, హోమాలు, శతచండీ పారాయణ, సుదర్శన మంత్రానుష్ఠానం, లక్ష్మీగణపతి జపం, అష్టద్రవ్య హోమం, రుద్రాభిషేకం తదితర పూజలు ఉంటాయని ఆయన వివరించారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమై, 9 గంటలకు ఉచిత కుంకుమార్చన, 11 గంటలకు సూర్య తీర్థ ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఆయా రోజుల్లో విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు.